# కథాకేళి



# ప్రేమ

# మల్లాది వెంకటకృష్ణమూర్తి

తెలుగువాళ్ళల్లో సుబ్బారావు పేరు ఎంత కామనో, అతను ప్రేమించే అమ్మాయి అంత అసాధారణం అని తెలిస్తే వెంటనే నమ్మలేదు. ఆమెని చూసాక ఆశ్చర్యపోయాను.

సుబ్బారావు మొదటి నించి సౌందర్యారాధకుడు. తన కాబోయే భార్య ఎంతో అందంగా వుండాలని కలలు కంటూండేవాడు. మేం ఇద్దరం రూమ్‌మేట్స్ కాబట్టి అతను తన కాబోయే భార్య ఎలా వుండాలో తరచు చెప్తూండేవాడు. రంభ, ఊర్వశి, మేనకల అందం లాంటి అందం వుండకూడదుట. సీత, రాధ, ద్రౌపది మొదలయిన పురాణ స్త్రీలకుండే అందం వుండాలిట. అందంలో కూడా పాజిటివ్, నెగెటివ్‌లు వుంటాయనే వాడు.

"నువే చెప్పు మరి- జ్యోతిలక్ష్మి, జయమాలిని, అనూరాధలకుండే అందం వుండే భార్యతో బయటికి వెళ్తే మగాళ్ళ చూపులెలా వుంటాయి? అదే సుహాసిని, శ్రీలక్ష్మి, సావిత్రిల కుండే అందం గల భార్యతో బయటికి వెళ్తే ఎవరూ అంతగా చూడరు" అనేవాడు.

అలాంటి సుబ్బారావు అకస్మాత్తుగా తను ఆఫీసర్‌గా పనిచేసే బ్రాంచ్‌కి గుంటకల్ నించి బదిలీ అయి వచ్చిన సుకన్యతో ప్రేమలో పడడం, అతని బ్రాంచ్‌లోని యావత్తు స్టాఫ్‌కి, నాకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

సుకన్యది రంభ, ఊర్వశి, మేనకల లానో, జ్యోతిలక్ష్మి, జయమాలిని, అనూరాధలలానో రెచ్చగొట్టే అందం కాదు.

అసలామె అందగత్తే కాదు!

నల్లటి నళ్ళు, మొహాన స్ఫోటకం మచ్చలు, లావు కళ్ళద్దాలు, పల్చటి జుట్టు ఆర్గండి చీర కట్టుకున్నా ఇంకా సన్నగా వుందే అనిపించే పర్సనాలిటీ...

సుకన్యతో సుబ్బారావు ప్రేమలో పడడం నిజంగా అందరికీ తొమ్మిదో వింత. అతన్ని కారణం అడగడానికి అసలికి నా రూంమేట్ కాదు. అతను నా గది ఖాళీ చేస్తే ఇంకొకతను వచ్చి చేరాడు.

ఓ రోజు సాయంత్రం టేంక్‌బండ్ మీద నేను స్కూటర్ మీద వెళ్తుంటే సుకన్య, సుబ్బారావు కలిసి చేతిలో చేతిని వేసి నడుస్తుండడం గమనించి స్కూటర్ని పక్కనే పార్క్ చేసి వాళ్ళ దగ్గరికి వెళ్లాను. ఇద్దరు ప్రేమికుల మధ్య నేనలా నిలబడడం తప్పని తెలిసినా, రెండేళ్ళుగా సుబ్బారావు నా రూంమేట్ కాబట్టి ఆపాటి చొరవ చేయగలిగాను. నన్ను చూసి ఇద్దరిలో ఎవరూ మొహం చిట్లించుకోలేదు. సుబ్బారావు ఆనందంగా నన్ను సుకన్యకి పరిచయం చేసాడు.

"ఇతను నా ఎక్స్-రూంమేట్. పేరు..."

"నమస్తే" చెప్పింది సుకన్య.

ముగ్గురం నడవసాగాం. సుకన్య కాన్వెంట్‌లో చదువుకుందనుకుంటాను- చక్కటి ఇంగ్లీష్ మాట్లాడుతోంది. ఎంతో సంస్కారవంతురాలు అనిపించింది నాకు.

ముగ్గురం వేమన విగ్రహం పక్కన కూర్చున్నాం. సుబ్బారావుని సుకన్య లోని ఏ అంశం ఆకర్షించిందో నాకు ఎంత తరచిచూసినా అర్థం కాలేదు. ట్యాంక్‌బండ్ మీద సరదాగా ఇంగ్లీష్‌లో కబుర్లు చెప్పడానికి తప్ప సుకన్య భార్యగా పనికిరాదు అనిపించింది నాకు. మాటల్లో ఆమె తండ్రి రిటైర్డ్ ఎక్సైజ్ కమిషనర్ అని తెలిసింది. సుకన్యకి సుబ్బారావు అంటే ఎంతో ఇష్టం అని గ్రహించగలిగాను.

ఆ సంఘటన జరిగాక సుబ్బారావుకి రెండుసార్లు ఫోన్ చేసి అడిగాను అతను సుకన్యని ప్రేమిస్తున్న మాట వాస్తవమేనా అని. అతను రెండుసార్లూ అవునని చెప్పాడు. ఆమెలో ఏం చూసావంటే సరయిన సమాధానం చెప్పలేకపోయాడు.

సుబ్బారావు గురువారం వుదయం మా బేంక్‌కి వచ్చాడు సుకన్యతో. నన్ను పక్కకి పిలిచి అడిగాడు-

"గురు. గోల్డ్ లోన్ ఇప్పించగలవా? అర్జెంటుగా ఇరవై వేలు కావాలి".

"ఎవరికి? ఎందుకు?" అడిగాను.

"సుకన్యకి. ఇంటికి పంపాలిట"

"ఒకరికి పది వేలు మించి ఇవ్వరు- ఎలా?"

"పోనీ ఆయన పేర సగం, నా పేర సగం ఇప్పించండి" అడిగింది సుకన్య సంగతి తెలిసి.

వాళ్ళిద్దర్నీ కూర్చోపెట్టి, ఫార్మాలిటీస్ పూర్తిచేసాను. ఇరవై వేలు సుకన్యకిస్తే చెప్పింది-

"చాలా థాంక్సండీ"

ఇద్దరు బయటికి వెళ్లారు. సుబ్బారావు తన పెన్ మర్చిపోవడంతో అతనికి ఇద్దామని బయటికి వెళ్లాను. స్కూటర్ పార్కింగ్‌లోంచి సుబ్బారావు గొంతు వినిపిస్తోంది.

"థాంక్స్ సుకన్య. కోఠి బ్రాంచికి వెళితే అక్కడ మిగతా నగలతో ఇంకో ఇరవై వేలు వస్తాయి. ఏభై వేలతో ఆ స్థలం కొనేస్తాను. నెమ్మది మీద నగలు విడిపించి నీకిచ్చేస్తాను. సమయానికి ఆదుకున్నందుకు థాంక్స్"

"ఇట్సాల్‌రైట్. అవసరానికి మీకు అవి వుపయోగపడుతున్నందుకు సంతోషంగా వుంది. నిజం చెప్పాలంటే నే పుట్టాక నాతో ఇంత ఇదిగా వుంది మీరొక్కరే"

ఆమె మాటల్లోని వినయత్వాన్ని బట్టి అనిపించింది నాకు, సుబ్బారావు ఆ నగలు తిరిగి ఇవ్వకపోయినా పెద్దగా పట్టించుకోదని.

రెండేళ్ళ తర్వాత సుబ్బారావు సుహాసిని, సావిత్రిలలా ఇల్లాలి కుండాల్సిన అందంగల ఓ అమ్మాయిని వివాహం చేసుకున్నాడు.

సుకన్య గురించి ఆ తర్వాత నాకు తెలీలేదు, కావాలని బదిలీ చేయించుకుని వెళ్లిపోయిందని తప్ప.

సుబ్బారావు ఇప్పుడా స్థలంలో ఇల్లు కట్టుకుంటున్నాడు. ●



ఆంధ్రజ్యోతి వారపత్రిక 11-5-90